# సిద్ధార్థాన్వేషణం

## ౧

"నా చిన్నారి! నా చిట్టి! నా నాయనా! లే! కాసిని పాలు తాగుదువు గాని లే! అయ్యో! ఎంత పొద్దెక్కినా ఇంకా లేవలేదేమిటి? బాబూ! లే! నా కన్నతండ్రీ!"

అంటూ గోతమి తన చిన్నారి కన్నతండ్రిని ఉయ్యాలలోనుంచి లేవదీసింది. ఆ పసివాడు రాత్రి అంతా నిద్రపోలేదు! ఒకటే ఏడుపు! తెల్లతెల్లవారేదాకా పోరు పెడుతూనే ఉన్నాడు. ఆ పసివాడెందుకు పోరు పెడుతున్నాడో ఆమెకు తెలియలేదు. ఆకలివేసి ఏడుస్తున్నాడేమోనని కొంత బలవంతంగా పాలుపోసింది. దానితో పిల్లవాడి ఏడుపు మరింత రెచ్చిపోయింది. అసలే అజీర్ణ రుగ్మతతో తీసుకుంటూన్న ఆ పసివానికి రాత్రి నాలుగైదుమారులు పాలుపొయ్యడంవల్ల ఆ రుగ్మత మరింత ఎక్కువై పోయింది. తెల్లవారేసరికి ఒళ్లంతా కాలిపోతున్నట్లుగా జ్వరం కాసింది.

ఆ ఇంటిలో గోతమితప్ప ఇంకెవరులేరు. ఆమె భర్త, మామగారు సార్థవాహ వ్యాపారులు. వారిద్దరు రాజగృహ నగరంలో ఉన్నారు. గోతమి అత్త, కుమార్తెకు పురుడు పొయ్యడానికని వైశాలీనగరం వెళ్లిపోయింది. ఇంట్లో ఒకరిద్దరు పరిచారకులుతప్ప ఇంకెవరులేరు. పెద్దవాళ్లెవరు అంత తొందరగా తిరిగివచ్చే ఆశ ఏమీ లేదు. అందువలన ఆ పసివాని సంరక్షణ భారం అంతా గోతమిమీదే పడింది. ఆమె అసలే చిక్కి బక్కపలచగా ఉండడంవల్ల ఇరుగుపొరుగు శ్రావస్తీ నగరవాసు లందరు ఆమెను కృశగోతమి అని పిలిచేవారు. పిల్లవాడికి రాత్రిరాత్రే ముంచుకువచ్చిన జ్వరంవల్ల ఆమె మరింత బెంగపెట్టుకుని చిక్కి శల్యమైపోయింది.

పిమ్మట రెండు మూడు రోజులవరకు ఆ జ్వరం బాగా ఎక్కువైపోయింది. గోతమి కాయకష్టంతో తన గృహ వైద్యునిచేత ఎన్నెన్నో చికిత్సలు చేయించింది. అయినా జ్వర తీవ్రత అలాగే ఎక్కువైపోయింది. అంతేగాని ఏమీ గుణం కనబడలేదు. ఆ వైద్యంతోబాటే ఆమె బాల గ్రహ చికిత్స కూడా చేయించింది. ఎందరెందరో దేవతలకు మొక్కుకొన్నది. రోజుకు నాలుగైదుసార్లు దిష్టితీసి చతుష్పథాలలో భూతబలు లర్పించింది. అయినా అయిదవనాటి రాత్రికి ఆరుగ్మత బాగా ముదిరిపోయింది. ఆ పసివాడింక జీవించడం దుర్లభమనే భయం కూడా బయలుదేరింది. గృహవైద్యుడా రాత్రి అంతా నిద్రాహారాలు లేకుండా గోతమి గృహంలోనే కనిపెట్టుకుని కూర్చున్నాడు.

ఒక వ్యక్తిని అత్యంతాప్యాయతతో ప్రేమించేవారికి ఆ వ్యక్తి అనుక్షణము తమ పట్టు విడిపించుకొని దూరదూరంగా వెళ్ళిపోతున్నట్లే భాసించడం సహజం.

## ప్రాచీన గాథాలహరి

గోతమి కిప్పుడు సరిగా అలాగే అనిపించింది. ఆమె కది లేక లేక కలిగిన సంతానం. అందులోను ఆ కలిగినసంతానం మగశిశువనే వార్త వినబడేసరికి శ్రేష్ఠి కుటుంబం అంతా ఉబ్బి తబ్బిబ్బైపోయింది. అంతవరకు గోతమి అంటే ఎంతో ఈసడింపుగా చూచే అత్తగారు కూడా ఆ క్షణంనించీ గోతమి అడుగులకు మడుగులొగ్గడం మొదలు పెట్టింది.

ఆమె కాపరానికి వచ్చిన ఏడెనిమిది ఏళ్ళదాకా సంతానం కలిగే సూచన లేమీ కనిపించలేదు. దానితో మామగారికీ అత్తగారికీ ఇక అంతటితో తమవంశం అంతరించిపోగలదనే భయం పట్టుకుని వేధించడం మొదలుపెట్టింది. వారి కొక కుమారుడు తప్ప వేరే సంతానమేమీ లేకపోవడంవల్ల ఆ భయం మరింత తీవ్రస్వరూపం ధరించింది. వారిద్దరు తమ కుమారుని కిక సంతు కలగదని నిరాశ చేసుకుని తిరిగీ వివాహం చెయ్యాలని కూడా సంకల్పించారు.

అయితే గోతమి కాపరానికి వచ్చిన ఉత్తరక్షణంనించీ శ్రేష్ఠి కుటుంబం పట్టినదంతా బంగారమై మారుమోగింది. కాని ఆమెకు సంతానం కలగకపోవడం మూలాన ఆ ఆనందం అంతా క్రమక్రమంగా మరుమరీచికగా మారిపోయింది. క్రమక్రమంగా శ్రేష్ఠి కుమారుని ద్వితీయ కళత్ర ప్రయత్నాలన్నీ ఫలోన్ముఖమైనాయి. వృద్ధ శ్రేష్ఠి దంపతులిద్దరు కుమారునికి ద్వితీయ వివాహ ప్రధానోత్సవం జరపవలెనని సంకల్పించారు.

అయితే గోతమి మ్రొక్కుకొన్న గృహదేవతల అనుగ్రహంవల్ల ఆ సమయంలోనే ఆమెకు గర్భసూచనలు కనిపించాయి. దానితో తాత్కాలికంగా గోతమికి వచ్చిన ఆ ఆపత్తు కాస్తా గడిచిపోయింది.

కుమారుడు కలిగిన నాడు గోతమి హృదయం ఒక్కసారిగా ఎగిరి గంతేసింది. ఆమె ఆపసికందును ఎంతో ఆప్యాయంగా పాలిచ్చి, కనురెప్ప వాల్చకుండా వానివైపు చూచి - "నాయనా! నాకన్నతండ్రీ! నీమూలంగానే మావారికి నామీద మళ్ళీ రవంత అనురాగం కలిగింది" అని కంట నీరు పెట్టుకొన్నది. అటుపిమ్మట ఎంతో మురిసిపోతూ పసివాణ్ణి భర్త చేతికందించింది.

ఆక్షణంనించీ ఆకుటుంబంలో వారెవరు ఆపసికందు నిక కింద దింపలేదు. అలాగలాగ కొంతకాలానికి వాడు తప్పటడుగులు వెయ్యడం మొదలుపెట్టాడు. కాని ప్రతి రాత్రీ గోతమికి ఆ పసివాడికేదో జబ్బు చేసినట్లో, హఠాత్తుగా దెబ్బ తగిలినట్లో కలలు వచ్చేవి. ఒక్కొక్కమారు ఆపసిబిడ్డ మరణించినట్లే కలగని, లేచి వలవలా ఏడుస్తూ ఆమరునాడంతా అన్నం ముట్టడమే మానివేసేది!

ఇంట్లోవారంతా అతిగారాబంగా పెంచడంవల్లనైతేనేమి, [illegible] కేవలిగా

పి. గణపతిశాస్త్రి

# ★ సిద్ధార్థాన్వేషణం ★

పిత్తశరీరత్వంవల్ల నయితేనేమి, తల్లి పోలిక రావడంవల్ల నయితేనేమి పుట్టినప్పటినుంచీ ఆపసివాడెప్పుడూ అర్భకంగా అరిపేదగానే ఉండేవాడు.

అత్తమామలు, భర్త ఇల్లు విడిచి వెళ్ళేటప్పుడు పసివాణ్ణెంతో భద్రంగా కంటికి రెప్పలా కాపాడుతూండవలసిందనీ, తామెంత తక్కువ రోజులలో తిరిగి రాగలమనీ చెప్పి దూర దూర నగరాలకు ప్రయాణమై వెళ్ళిపోయారు. వారు ఇల్లు విడిచి వెళ్ళిన మరునాటినుంచీ పసివానికి రుగ్మత ప్రారంభమైనది. క్రమక్రమంగా అది ప్రాణాంతకంగా పరిణమించింది.

అయితే జ్వరం తగిలిన అయిదవ నాటి రాత్రి గడిచేసరికి పిల్లవానికి కొంచెం సుఖంగా ఉన్నదని అనిపించింది. ఆరవ నాడంతా వ్యాధి కొంచెం తగ్గినట్టే కనిపించింది. అయితే ఆనాటిరాత్రి వ్యాధి మళ్ళీ తిరగబెట్టింది. సేవకులు వెంట వెంటనే వైద్యుని ఇంటికిపరుగులు పెట్టారు. వైద్యుడు వచ్చి ఏదో గట్టిచికిత్స చేశాడు. ఇక మరి భయంలేదని చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు. సేవకులుకూడా తెల్లవారగట్టే లేచి తమ కుటీరాలకు మరలిపోయారు. తరవాత పసిబిడ్డ సుఖంగా నిద్రపోతున్నట్టే కనిపించాడు.

తెల్లవారే సమయానికి పిల్లవానిధోరణి చూడడానికి గౌతమి హృదయంలో ఏవో పెద్దగుబులు పుట్టుకొచ్చింది. ఆమె అంతకు పూర్వం ఎన్నడూ మరణించినవారి నెవరినీ చూడలేదు. వెంటనే అబిడ్డనెంతో భద్రంగా గుండెల కదుముకొని గృహవైద్యుని భవనానికి తీసుకు వెళ్ళిపోయింది.

౨

అప్పుడే అరుణోదయం అయింది. అది మండు వేసంగి. శ్రావస్తీ నగర పౌరులింకా తమ వీధిద్వారాలు తెరవలేదు. గ్రీష్మాధిక్యం వల్ల రాత్రిఅంతా నిద్రపట్టక, తెల్లవారే వేళ చిన్న కునుకు పట్టిన గృహవైద్యుడు గౌతమి పిలుపు విని వీధి గుమ్మంలోనికి వచ్చాడు. గౌతమి చీర చెరగు కొంచెం తొలగించి పిల్లవాని ముఖం చూపించింది. వైద్యుడొకసారి నాడి పరీక్ష చేసి "అమ్మా! విచారించకు తల్లీ! ఇక ఏమి చేసినా ఏమీ లాభం లేదు! ఇక ఈ క్షణంలోనో మరుక్షణంలోనో ప్రాణవ్యుత్క్రమణం జరిగిపోతుంది. వెంటనే ఇంటికి తీసుకు పోవడం తప్ప వేరే చెయ్యగలిగిందేమీ లేదు!" అన్నాడు.

ఆ పైన గౌతమి మరి మాటాడలేదు. వెంటనే వెనుదిరిగి తన ఇంటి కేసి నడిచింది. గృహవైద్యునికామె ధోరణి ఎంతో విచిత్రంగా కనబడింది! అంతటి విషాదవార్త వినిపించినా ఆమె ఎక్కడా చెక్కు చెదరలేదు! అలాగే వైద్యునివంక చూసి పక్కుమని ఒక్క నవ్వు నవ్వింది! గృహవైద్యుడామె కనిపించినంతవరకు అలాగే రెప్ప వాల్చకుండా ఆమె ధోరణి పరికించి చూశాడు.

కాని గౌతమి అంతటితో ఇంటికి మరలిపోలేదు. మరి ఒక ఘన వైద్యుని దగ్గిరికి వెళ్ళి తన శిశువును రక్షించవలసిందని ఎంతో దీనంగా బ్రతిమాలింది. ఆ వైద్యుడొకమారు శిశువు ముఖం పరిశీలించి "ఇంకేముంది! అంతా అయిపోయింది తల్లీ! ఇంక ఇంటికి తీసుకుపో!" అన్నాడు.

ఆ మాట విని ఆమె గట్టిగా ఒక నవ్వు నవ్వి—"అయ్యో నా చిట్టితండ్రిముఖం అలాగ కళకళలాడుతూంటే ప్రాణం పోయిందని అనడానికి మీకెలాగ నోరాడిందయ్యా!" అని అబిడ్డను తిరిగి భుజానవేసుకొని తొందరగా మరి ఒక ఒక ఓషధీ వైద్యునిదగ్గిరికి వెళ్ళిపోయింది.

అతడు పండు ముదుసలి. ఓషధీవైద్యంలో శ్రావస్తీ నగరం అంతటా ప్రసిద్ధికెక్కినవాడు. అతన్ని చూడగానే గౌతమికి తన తండ్రిముఖం జ్ఞాపకం వచ్చింది. జలజల ప్రవహించే కన్నీరు చీర చెరగుతో తుడుచుకొని అతని పాదాలపై బడి "ఎంతమంది ఘన వైద్యులకు చూపించినా నా బిడ్డ ప్రాణం పోయిందనే అంటున్నారు! కాని ఆ ముఖంలో ఎక్కడా జీవకళ తగ్గలేదు! నా చిట్టి తండ్రి నన్ను చూచి ఇంకా అలాగే చిరునవ్వులు చిలకరిస్తూనే ఉన్నాడే! వారికా మాట అనడానికెలా నోరాడిందో తెలియడంలేదు! ఇక నా బిడ్డను కాపాడగలవారు మీరొక్కరే!"

అని అనేక విధాలుగా విలపించింది. ఆ వృద్ధుడు మొట్టమొదట కొంతసేపటివరకు అలాగే నిర్ఘాంతపడి నిలుచున్నాడు. అటుపిమ్మట అతని కామె మానసిక పరిస్థితి అంతా అవగాహన అయిపోయింది. ఆ శిశువు మరణించడంతోనే మహాతాపాన్ని తాళలేకవల్ల ఆమె హృదయం వికలమైపోయినదనీ అందువల్లనే ఆమె అవిధంగా మాట్లాడుతున్నదనీ గ్రహించివేశాడు. కాని ఆమె దైన్యస్థితికా వృద్ధహృదయం నీరైపోయింది. ఆమె ఎన్నడూ అటువంటి కష్టం ఎరిగి ఉండకపోవచ్చునని కనకనే తాత్కాలికంగా ఆమె కావిధమైన ఉన్మత్త మానసిక స్థితి ఏర్పడి ఉండవచ్చునని అనుకొన్నాడు. అయితే [illegible] ఆమె నోదార్చవలెనని అభిప్రాయంతో నెమ్మదిగా ఇలా అన్నాడు.

"తల్లీ! నేనోషధీ వైద్యంలో పేరుపొందిన వాడనే! కాని ఏమిలాభం! అంతా అయిపోయింది! ఈ చరమదశలో నేనేమి చెయ్యగలను! అయితే ఇలాంటివారిని కూడా పునరుజ్జీవింప జెయ్యగలవారీలోకంలో ఒక్కరే ఉన్నారు! మహా కారుణికుడైన ఆ మహానీయుని చరణపద్మాలాశ్రయించు తల్లీ! ఈ లోకంలో ఆయన ఒక్కడే నీ కోరిక నెరవేర్చగల సర్వసమర్థుడు!"

ఇంతసేపటికి గౌతమికి తన శిశువు మరణించిన విషయం యథార్థమే అని తెలిసింది. కాని అటువంటి శిశువును కూడా బ్రతికింపగల సర్వసమర్థుడానగరంలో ఉన్నారనేమాట వినబడేసరికి కామె హృదయంలో తిరిగి ఒక మహోజ్జ్యోతి వెలిగింది!

"ఎవరా కారుణికమూర్తి?" అని ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది. ఆ ప్రశ్న వెలువడగానే గౌతమి చెక్కిళ్ళపై వేడికన్నీటి బిందువులు సంతతధారగా ప్రవహించాయి.

"గౌతమ బుద్ధులు!"

"ఆ మహానీయులు మన నగరానికి వేంచేశారా?"

"నీ కింకా తెలియనే తెలియదా?"

"తెలియదు! ఎక్కడ విజయం చేశారో?"

"అనాథ పిండకుని జేతవనంలో!"

"నిజంగానేనా? బాబూ! ఎప్పుడు?"

"నిన్ననే!"

ఆ మాట వింటూనే గౌతమి తన మృతశిశువు నెంతో ఆప్యాయంగా గుండెల కదుముకొని తొందర తొందరగా జేతవనం వైపు నడిచి వెళ్ళిపోయింది.

తన చిన్నతనంలో గౌతమి ఒకప్పుడా కరుణామూర్తిని సందర్శించింది. ఇటీవల తిరిగి శ్రావస్తినగరాని కామహానీయుడు విచ్చేయగలడని నగరపౌరులెంతో ఉత్కంఠతో సంభాషించుకొంటున్నారు. ఆయన సమ్యక్సంబుద్ధుడు! అపారకరుణామూర్తి! ఎంత మందిదుఃఖార్తులా కరుణామయుని కటాక్షపాతంతో తమ దుఃఖసాగరాలను లీలగా ఈదుకుపోలేదు! ఒక్క చిన్న శిశువు పునరుజ్జీవింపజెయ్యడానికా మహామహుని కరుణాకటాక్షలేశం చాలదా? అని ఈ విధమైన భావపరంపర లెన్నెన్నో గౌతమి హృదయకుహరంలో పరవళ్ళు తొక్కాయి.

అటుపిమ్మట ఆమె తన దగ్గర శిశువున్న విషయం కూడా ఎవరికీ తెలియనీయకుండా జేతవన మహావిహారంలో ప్రవేశించింది. తొందర తొందరగా ద్వారాలన్నీ దాటి వెళ్ళిపోయింది. ఆ సమయంలో ఆమె హృద

యంలో గౌతమబుద్ధ సందర్శం ఒక్కటే ఏకైకలక్ష్యం!

తొందర తొందరగా సమ్యక్సంబుద్ధుని సమీపాని కెంతో ఉద్విగ్న హృదయంతో నడిచి వెళ్లిపోతున్న ఆ దీన మూర్తి ఎవ్వరా అని కొందరు భిక్షుకీభిక్షుకు లొక్కక్షణ కాలం ఆమెవైపు చూచారు. ఉత్తరక్షణంలోనే తిరిగీ తమతమ ధ్యాననిష్ఠలలో మునిగిపోయారు.

జేతవన మహావిహారంలో వటవృక్షచ్ఛాయ లింకా తమ పశ్చిమదిశా యాత్రలలాగే సాగిస్తున్నాయి. అప్పుడప్పుడే ఉదయిస్తున్న సూర్యకాంతులు కాషాయవస్త్రాలు ధరించిన శ్రమణక బృందంలా మెరిసిపోతున్నాయి.

బుద్ధదేవుని గృహద్వారంలో నిలబడిన ఆనందు డాదీనురాలి ముఖభంగిమ పరిశీలించి చూచాడు. ఆ చూపులో ఆనందునికేమి అవగాహన అయిందో! అతడామెను లోపలికి పోవద్దని వారించలేదు. లోపలికి పోవచ్చుననీ అనుమతీ ఇవ్వలేదు! అతని నేత్రాల నుంచి కవోష్ణ బాష్పధారలు నిరంతరధారగా ప్రవహించాయి. అంతే! ఒక్క అంగలో గోతమి అపార సమ్యక్సంబుద్ధ శాక్యసింహుని పాదాలమ్రోల వాలిపోయింది.

## 3

గోతమి బుద్ధదేవునికి పాదాభివందనం ఆచరించిన పిమ్మట క్షణకాలంపాటూ తేజోమూర్తి ముఖంవైపు చూచింది. ఆ క్షణంలో ఆమెకు తనకన్నతల్లి ఒడిలో మేనువాల్చినట్లే అనిపించింది. నిశ్చల కృపాసాగరాలవలె తళతళలాడే అతని నేత్రాలు చూడగానే ఆమెకు తన గోడంతా ఒక్కమారుగా వెళ్లబోసుకోనవలెనని అనిపించింది. శ్రావస్తీనగర పౌరులలో ఆ మహనీయుని దివ్యశక్తులను గూర్చిన వింతవింత గాథలెన్నో వ్యాపించాయి. అంతటి మహనీయునికి తన చిన్నిశువును బ్రతికించడం ఒక లెక్క కాదనీ ఇక తనశిశువు తిరిగి జీవించడం తథ్యమేననీ ఆమె నిశ్చయించింది. ఆ శిశువువల్లనే తనభర్తకు, అత్తమామలకు తనపై గౌరవం ఏర్పడినదనీ, ఆ పసివాడు జీవించకపోతే భర్త, అత్తమామలు తనను విడిచిపెట్టి వెయ్యగలరనీ, వాని చిరునవ్వులమీగే తన ప్రాణం నిలుపుకొంటున్నాననీ ఆ పసిపాప లేనిదే తానిక జీవించజాలననీ వెంటనే ఆపసికందును బ్రతికించవలసిందనీ ఆ దయామూర్తి కనేకవిధాలుగా విన్నవించవలెనని అనుకొన్నది. గద్గదికతో వణికిపోతూ బుద్ధదేవుని కేవేవో కొన్నివిషయాలెంతో జాలిగా విన్నవించింది. అంతలో ఆమె హృదయాంతరాళ దుఃఖం అంతా ఒక్కమారుగా ఉప్పెనలా పొంగింది! వెంటనే ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తిరిగీ అతని పాదాలపై వాలిపోయింది! ఆపైన కొంతసేపటివరకు ఆమెకు స్పృహ తప్పిపోయింది. ఆ చైతన్యరహిత స్థితిలో ఎంతసేపున్నదో ఆమెకు తెలియలేదు. తిరిగీ తెలివివచ్చేసరికి గౌతమబుద్ధుడు చిన్ని చిరునవ్వుతో నిరంతర కరుణాధార వర్షిస్తూ కనురెప్పపాటు లేకుండా ఆమెవైపు తిలకిస్తున్నాడు. ఆ చూపులతో గోతమి హృదయం బాగా సేదదేరింది. ఆమె మృతశిశువు ముఖంవైపొకమారుచూచి, చెదిరిన ముంగురులు సరిదిద్ది శిశువును నెమ్మదిగా గౌతమదేవుని పాదాలకు దగ్గరగా పడుకోబెట్టింది. తిరిగీ అతిదీనంగా తన చిన్నిశిశువును బ్రతికించవలసిందని ప్రాధేయపడింది.

నీరవ గభీరసాగరంవలె నిశ్చలమైన సమ్యక్సంబుద్ధుని హృదయంకూడా ఆ దీన మూర్తి ప్రార్థన లాలకించేసరికి మెల్లమెల్లగా కల్లోలితమై కలిగిపోయింది!

“గోతమీ! నీ శిశువు తిరిగీ జీవించగలడు! దానికి నీవేమీ అధైర్యపడ నక్కరలేదు. అయితే గుప్పెడు సిద్ధార్థాలెక్కడనైనా సంపాదించగలవా?” అని గౌతమబుద్ధుడు నిశ్చలంగా ఆమెవైపు చూచాడు.

గోతమి ఈ ప్రశ్న వినగానే నిర్ఘాంతపోయింది. గుప్పెడు తెల్లావాలతో తన శిశువు తిరిగీ జీవించగలడంటే ఆమెకంతగా నమ్మకం కలగలేదు!

“కృపామూర్తీ! గుప్పెడు తెల్లావాలకేమి భాగ్యం! అవసరమైతే వేయిగుప్పెళ్లైనా తీసుకురాగలను!”

“ఒక గుప్పెడు చాలునులే! గోతమీ! అయితే అవి ఇరుగుపొరుగు వారినడిగే సంపాదించాలి! తెలిసిందా!”

“పోనీ అలాగే! ఇరుగు పొరుగువారినడిగే తీసుకువస్తాను!” అని ఆమె బయలుదేరబోయింది.

“అయితే ఒకమాట! ఆ ఇరుగుపొరుగు వారి ఇళ్లలో ఇదివరకెన్నడూ సంతానష్టం కలిగి ఉండకూడదు! ఆ తెల్లావాలు అటువంటివారినే అడిగి సంపాదించాలి! ఇది చాలా ముఖ్యవిషయం. తెలిసిందా?”

“అలాగే! ఈ మహానగరంలో ఆ మాత్రం అదృష్టవంతులే దొరకకపోతారా! తిరిగీ ఒక అరగడియలోనే మీ దర్శనానికి వచ్చివేస్తాను.”

అని చెప్పి ఆ శిశువు నక్కడే విడిచిపెట్టి గోతమి తొందరగా ఆ మహావిహారందాటి నగరంలోకి వెళ్లిపోయింది. నడుస్తున్నదన్నమాటేగాని ఆమెకు ఒంటిమీదస్పృహ లేదు. త్వరలోనే తన శిశువు జీవించగలడనీ తిరిగీ చిరునవ్వులతో కలకలలాడే తన చిట్టిచంద్రముఖం తిలకించవచ్చుననీ ఆ ముఖంపై తనివితీరా ముద్దులవర్షం కురిపించవచ్చుననీ ఆమె ఎంతైనా సంబరపడింది. అనంతరం భర్తకేగాక, అత్తమామలకుకూడా తనపై గౌరవం ఇంకా ఇనుమడించగలదని ఆమె లోలోపల ఎంతైనా మురిసిపోయింది. మొత్తంమీద శ్రావస్తీనగర రాజవీధులలో నడుస్తున్నంతసేపు ఆమె హృదయం ఆ చిన్ని శిశువును గురించిన పగటికలలతోనే పరవళ్ళు దొక్కింది.

అప్పటికి రెండు యామాలకాలం గడిచిపోయింది. ఎండ వేడిమి భరించలేక శ్రావస్తీ నగరంలో గృహాలన్నీ కళ్ళు మూసుకొన్నట్లుగా కనిపించాయి

ఆమె ఒకటిరెండు ఇళ్లతలుపులు తట్టి తన ప్రార్థన తెలియజేసింది. వారు తమ గృహాలలో ఇటీవలనే సంతానష్టం జరిగిందని తెలియజేసి మళ్లీ మర్యాదగా తలుపులు వేసుకొన్నారు. కొందరామె వాలకంచూచి మతిభ్రమణం జరిగిందేమోనని మరి సమాధానా లివ్వడమే మానివేశారు. అలాగ ఆ మండుటెండలో ఏడెనిమిది ఇళ్ళలోనికి వెళ్ళినా ఎక్కడా ఆమెకొ గుప్పెడు తెల్లావాలు

### ఆయన ప్రాణం విలువ

ఒక లోభి ఒక రోజున నది ఒడ్డుకు షికారు వెళ్లి, కాలు జారి ప్రవాహంలో పడ్డాడు. ఒక జాలరి వెంటనే నీటిలోకి దూకి, అతి ప్రయాసమీద గట్టు చేర్చాడు. తన ప్రాణం కాపాడినందుకు సంతోషించి, జాలరికో పావలా బహూకరించాడా ధనికుడు.

చుట్టుజేరిన జనం ముక్కున వేలేసుకుని ‘హారా!’. అన్నారు. మళ్లా నీళ్ళలోకి తోసెయ్యాలని కొందరు సలహా యిచ్చారు.

గుంపులో ఓ పెద్ద మనిషి వారిని వారించాడు. “అయినా కాపోయినా, ఆయన ప్రాణం విలవెంతో మనకన్న ఆయనకే బాగా తెలుస్తుందిగదా” అన్నాడాయన.

పోతోంది! మరొక ఇంటికి వెళ్ళేసరికి అప్పుడే ఒక మృత శిశువును శ్మశానవాటిక తీసుకు పోతున్నారు. ఆ శిశువు తల్లి కరుణాక్రందనం ఆలకించేసరికి గౌతమి నిలువునా వణికిపోయింది.

ఆ విధంగా ఆ మండు టెండలలో ఆమె ఎన్నెన్నో ఇళ్ళకు వెళ్ళింది. తిరిగి వెంటనే తిరుగుపడిపోయి తిరిగివచ్చింది.

క్రమంగా మూడు యామాల కాలం గడిచిపోయింది. అప్పటికామె సుమారొక నూరు గృహాలైనా తిరిగింది. ఏ యింటికి వెళ్ళినా జీవించియున్న సంతానంకంటె చనిపోయిన సంతానమే ఎక్కువగా ఉన్నట్లు కనబడింది.

అటుపిమ్మట ఆమె మరొక రాజవీథికి వెళ్ళి సుమారింకొక నూరు ఇళ్ళయినా గాలించింది. క్రమ క్రమంగా ఆమెకా సిద్ధార్థాన్వేషణం ఫలించగలదనే ఆశ పూర్తిగా సన్నగిల్లిపోయింది. చిట్టచివర మరొక వీథికికూడా వెళ్ళి చూచింది. ఎక్కడవిన్నా సంతానమృతిని గురించిన కరుణగాథలే! పిమ్మట ఆ గాథలువిన్న ఆమె హృదయంలోని విషాదం కొంతవరకు ఉపశమించినట్టయింది. అయినా ఆమె తన శిశువు జీవితం విషయం ఆశ విడిచిపెటలేదు!

అయితే సిద్ధార్థాన్వేషణం విరమించి వెంటనే జేత వనవిహారానికి వచ్చివేసింది.

౪

ఆమె దీనవృత్తాంతం విని అక్కడి భిక్షుకులు అన్నపానాలతోను, ఓదార్పుమాటలతోను ఎంతో ఆప్యాయంగా ఆదరించారు. ఆవిధంగా ఒక గడియసేపు విశ్రమించిన తర్వాత తిరిగి ఆమె బుద్ధదేవుని చరణ సన్నిధికి వెళ్ళిపోయింది.

ఆమె ఆ దివ్యమూర్తి సందర్శించేసరికి అప్పుడే సూర్యాస్తమయం అయింది. బౌద్ధ భిక్షుకులందరు విహారంలో ధ్యాననిష్ఠులై ప్రశాంత మౌనం అవలంబించారు. మరికొందరు ధీర గంభీర స్వరాలతో బౌద్ధధర్మ గాథలు పారాయణం చేస్తున్నారు.

బుద్ధదేవుని సందర్శించగానే గౌతమికి తిరిగి పూర్వ విచారం అంతా స్మరణకు వచ్చింది. మెల్లిదిగా తన సిద్ధార్థాన్వేషణ గాథ అంతా అతనికి విన్నవించింది.

సమ్యక్సంబుద్ధుడొక చిరునవ్వు నవ్వి,

"అమ్మా! ప్రపంచమే బహుశ దుఃఖమయం! కన్న సంతానంకోసం నీలా విలపించే తల్లులెందరున్నారో నీవే కనుగొన్నావు గదా! మెల్లిదిగా ఇంటికి వెళ్ళి నీ మనస్సు సమాధాన పరుచుకో!" అన్నాడు.

కాని గౌతమి కంతమాత్రంచేత సంతృప్తి కలగలేదు! "కొంచెం దయచేసి నా కన్నతండ్రి ఈ మండుటెండలో ఎక్కడికి వెళ్ళిపోయాడో చెప్పండి!" అని అడిగింది. ఆమె చెంపలమీద కన్నీరేకధారగా ప్రవహించింది. ఆమె అతని పాదాలపై వాలిపోయింది.

సమ్యక్సంబుద్ధుడు మెల్లిదిగా ఆమెతో- "తల్లీ! జీవులు తమ కర్మగతిని బట్టి ఆయా లోకాలకు వెళ్ళిపోతారు. ఆ విషయాలన్నీ నీ కెరుక పరచాలనే అనుకుంటున్నాను. తిరిగి ఇంకొకమారిక్కడికి రా!" అన్నాడు.

ఆ మరునాడు గౌతమి గౌతముని దగ్గరకు వెళ్ళింది. అలాగే ప్రతిదినం ఆ కరుణానిధి సన్నిధికి వెడుతూండేది. క్రమ క్రమంగా ఆమె మాతృహృదయం సంతాన మృతికి కన్నీరు మున్నీరుగా విలపించే తల్లుల హృదయాల శోకభారాలతో తల్లడిల్లిపోయింది. ఆమె తన ఉపచారవాక్సుమృత ధారలతో వారినందరినీ ఓదార్చి ఆ ఓదార్పులో కొంత కొంత మనశ్శాంతి పొందింది.

మరికొంత కాలానికామెకు ప్రపంచంలోని ప్రతి ప్రాణి తన సంతానమే అనే భావన కలిగించింది. ప్రతి ప్రాణిలోను ఆమెకు తన కుమారుని చిరునవ్వులే స్ఫురించాయి.

ఆకాశంలో కలహంసలతో విహరించే పక్షుల బారులలోను, సంజెవేళ పక్కున నవ్వే తారల తీరులలోను, భిక్షు భిక్షుకీగణంలోను, సమస్త ప్రాణి లోకంలోను, సర్వ వస్తుసముదాయంలోను ఆమెను తన కుమారుని చిరునవ్వులే స్ఫురించాయి. అపారమైన ఆమె మాతృ హృదయం అనంతాకాశం వలె విశాలమై ప్రపంచం అంతటా చల్లని వెన్నెలవెలుగులు విరజిమ్మింది! విశాల క్షీర సాగరమై అడుగడుగునా అమృతవర్షం వర్షించింది.

క్రమక్రమంగా ఆమె బౌద్ధధర్మం స్వీకరించి బౌద్ధభిక్షుకీరూపంలో జీవరాశికంతటికీ ఒక మహామాతృమూర్తిగా అవతరించింది.

గౌతమి ఆత్మీయ మిత్ర గౌతమి తనుగృహానికి మరలిరాదని నిశ్చయించి కుమారుని తిరిగి ద్వితీయవివాహం చేశారు. తనపూర్వాశ్రమ విషయాలలో కేవలం తటస్థవృత్తి వహించినా ఒకనాటి సంజెవేళ ఆమెకావిషయం కొంచెం కర్ణాకర్ణిగా తెలిసింది. కాని ఆమె ఆవిషయం ఉత్తరక్షణంలో విస్మరించివేసింది!

అంతలోనే క్రమక్రమంగా ఆమెకెదురుగా స్ఫురించే విశాల సాంధ్య నీలాకాశంలో అనంత తారకాకుమారుల ఖేలనకల్లోలం చెలరేగింది. ఆక్షణంలో ఆమె తన ప్రత్యేక వ్యక్తిత్వాస్తిత్వమే విస్మరించి అనంత నిర్వాణానంద సాగరంలో ఓలలాడింది! ★

"మూడు రోజుల నించి, కునుకన్నది లేదనుకో. ఎల్లుండి తెల్లవారేసరికి ఐదు వేల రూపాయలు ఎలాగో అలా సంపాదించకపోతినా, ఇల్లు వేలం అయిపోతుంది."

"అయ్యో పాపం. అలాగా. వెంటనే నాదగ్గరికి రాకపోయావా?"

"నువ్వు ఆదుకుంటావా? నిజంగా..."

"అబ్బే. డబ్బు నం గతి కాదు. బాగా నిద్రపట్టడానికి నాదగ్గర అద్భుతమైన మందుంది..."


# పంచతంత్రం

# బొమ్మల కథల పుస్తకం

## మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: శ్రీ శ్రీ

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-8-0

ఆంధ్ర గ్రంథమాల మద్రాసు